
# మనిషికి కావలసింది!

వజ్రాయుధం మంత్లీ.. మే, 2002



'ఒరేయ్ఁ... మొత్తానికి మన కావేరి మేడమ్ బాస్‌ని భలే మేనేజ్ చేస్తోందిరా! కనుల కింపైన జంట... ఈడూ జోడూ బాగానే ఉంది!"

– ఆఫీసులోని హెడ్‌క్లర్క్ హేళనగా మాట్లాడుతూంటే...

"అవును... ఆ నవ్వులు రత్నాల వానను కురిపిస్తున్నాయి. ఆవిడ ఇకఇకలు, పకపకలు, ఇచ్చిపుచ్చుకోవడాలూ... గివ్ అండ్ టేక్ పాలసీ అన్నమాట!"

"రోజూ మనకు భలే నేత్రానందం చేస్తున్నారు. పూర్ ఫెలో... అసలు ఆమె భర్త ఎవరో..?!" మరొక గుమస్తా కామెంట్ చేస్తున్నాడు.

"కావేరి భలే తెలివైందిరా! తనకు కావల్సినదాని గురించి దేన్ని వదులుకోవడానికైనా వెనుకాడదు. మొగుణ్ణి ఎక్కడో వదిలేసి వచ్చేసి, ఈ ఉద్యోగంలో స్థిరపడిపోయింది!" ఆఫీసు స్టాఫ్ ఎవరికి తోచిన రీతిలో వారు కావేరిని, ఆమె పైఆఫీసరుని ఎగతాళిగా మాట్లాడుకుంటుంటే-

"ఏమోయ్ఁ శ్రీహర్షా! ఏమిటలా విరక్తిగా నవ్వుతున్నావు. అవునులే... నీవు ఈ ఆఫీసుకు ట్రాన్స్‌ఫరై కొత్తగా వచ్చావు కదూ- ఇక్కడి విషయాలు నీకు ఎక్కువగా తెలియవు. నాలుగురోజులు ఆగితే అన్నీ నీవే గ్రహిస్తావు."

"మన మేనేజర్‌కి- కావేరి ఎంత అంటే అంత! ఆమె మాట వేదవాక్కు! ఆయన్ని భలే మేనేజ్ చేస్తోంది. మేమింత మందిమి ఉన్నాం- ఎందుకూ... పాతికేసి సంవత్సరాలు గాడిద చాకిరీ చేసినా లీవ్ కావాలంటే ఆమె అప్రూవ్ చెయ్యాలి. ఒక బిల్లు పాస్ అవ్వాలంటే ఆమె వెరిఫై చెయ్యాలి. అంతా కొంగు మహిమ! ఇద్దరిదీ స్వీట్ ఎఫైర్! కానీ, ఆమె అసలు మొగుడు పెళ్ళాన్ని వదిలేసి ఎక్కడున్నాడో... అమాయక జీవి!" ఓ గుమస్తా విషయాన్ని సాగదీస్తూ చెబుతూంటే చిన్నగా నవ్వుకున్నాడు శ్రీహర్ష.

"ఆమె అటువంటిది కాదని నా అభిప్రాయం!"

"అంటే..?"

"ఆమె స్వాభిమానం, అతిశయం ఎక్కువ గల ఆడది! ఒక ఆఫీసులో ఆడా-మగా కలసి పనిచేస్తూంటే సరదాగా మాట్లాడుకోవడాలు, ఎక్స్‌ఛేంజ్ ఆఫ్ ఐడియాస్ సర్వసాధారణం! వాటిని మనం విపరీతంగా ఊహించుకోకూడదని నా అభిప్రాయం!"

"ఏమిటీ... వాళ్ళ గురించి అన్నీ తెలిసినవాడిలా మాట్లాడుతున్నావ్..?!"

"అవును... అన్నీ తెలుసు! ఇంకా వివరంగా చెప్పాలంటే... ఆమె 'శ్రీహర్ష' అనే అమాయకుడి భార్య! ఆ అమాయకుణ్ణి నేనే! ఆమె మనస్తత్వం నాకు బాగా తెలుసు. ఆమె అటువంటిది కాదు. ఫ్లాలైట్ టైపు లేడీ!"

"..................."

ఇక్కడ కావేరి, శ్రీహర్షల గురించి కొంచెం వివరంగా చెప్పాలి-

శ్రీహర్ష కుటుంబంతో నాకు మంచి స్నేహసంబంధాలే ఉన్నాయి. నిజానికి- శ్రీహర్ష బ్యాచిలర్‌గా ఉన్నప్పట్నించి మేమిద్దరం స్నేహితులమే! ఇద్దరం ఒక ఆర్గనైజేషన్‌లో ఒకేసారి ఉద్యోగంలో ప్రవేశించడం జరిగింది. దాదాపు పది సంవత్సరాల స్నేహం మాది. అతని భార్య కావేరి కూడా 'అన్నయ్యా... అన్నయ్యా...' అంటూ నన్నెంతో ఆప్యాయంగా పలకరిస్తుంది. స్పెషల్ అకేషన్స్‌లో మా రెండు కుటుంబాలు ఒకేచోట కలుసుకొని సరదాగా కాలక్షేపం చేయడం కూడా అలవాటు. కావేరి, శ్రీహర్ష ఏ ఒక్కవిషయంలోనూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనిపించరు. అలవాట్లు, అభిరుచులు, తత్వాలు, హాబీలు... అన్నీ పరస్పర విరుద్ధంగా ఉంటాయి.

శ్రీహర్ష నిలువెత్తు పర్సనాలిటీతో, అందంగా, ఆరోగ్యంగా, హాండ్సమ్‌గా ఉంటాడు. శ్రీహర్ష మరీ సాత్వికుడు. చాలా సున్నితమైన మనసు! జీవితాన్ని చాలా పాజిటివ్‌గా, హ్యాపీగా తీసుకొనే నైజం! దేనికీ ఆరాటం కాని, తపన కానీ ఉండదు. ఒక్కమాటలో చెప్పాలంటే... అతనిది నిలబడి నీళ్లు త్రాగుదామనుకొనే తత్త్వం! దేనికైనా పోటీపడటం, దానికోసం పరుగులు తీసి అర్రులుచాచడం, అందుకోలేనప్పుడు నిరాశచెందడం ఇష్టంలేక ఉన్నదానితో సరిపుచ్చుకొనేవాడు.

కావేరి మాత్రం సన్నగా, పొడవుగా, సాధారణమైన రూపురేఖలతో బ్లాక్‌బ్యూటీలా అనిపిస్తుంది. కొత్తలో 'కాకి ముక్కుకి దొండపండ'ని మా ఫ్రెండ్స్ చెవులు కొరుక్కునేవాళ్ళు. పాపం... శ్రీహర్ష దురదృష్టానికి బాధపడ్డాం కూడా! ఏదో ఒత్తిడి వల్లే ఆమెను చేసుకొనివుంటాడు. ఇకపైన తనకేమాత్రం సరిపోని ఆ స్త్రీతో అతని బ్రతుకెంత దుర్భర మౌతుందోనని దిగులుపడ్డాం కూడా. కానీ, అతని మనసులో అటువంటి వెలితి ఏమీలేని అతడామెను ఎవరి ఒత్తిడితోనూ కాకుండా స్వయంగా చూసి ఇష్టపడే చేసుకున్నాడని అర్థంచేసుకున్నాం.

వాళ్ళిద్దరూ మొదట్లో అన్యోన్యంగానే ఉండేవారు.

కానీ, కావేరి స్వభావం అలా కాదు. శ్రీహర్ష తరహాకి పూర్తిగా విరుద్ధం! ఆమె అనుకున్నది సాధించితీరాలన్న పట్టుదలతో ఉంటుంది. జీవితంలో ఉన్నతిని సాధించాలనే పట్టుదల గల నేటితరం స్త్రీ! మొదటినుండీ మనుషుల మధ్య తనకంటూ ఒక గుర్తింపు కోసం ప్రాకులాడే మనస్తత్వం ఆమెది! అందుకోసం ఎంతగా కష్టపడి పనిచేయాలన్నా, రిస్క్ తీసుకోవాలన్నా వెనకాడేది కాదు.

పెళ్ళయిన తరువాత సిటీకి కాపురానికి రాగానే- ఆమె తన ఆశయాలకు రూపకల్పన చేసే ప్రయత్నంలో పడింది. శ్రీహర్షకి ఆమె ఎంత అంటే అంత! అసలెవరి అభిప్రాయాల్నీ ఖండించటం, వాదించే స్వభావం కాకపోవడం వల్ల కావేరికి అతన్నుంచి ఎటువంటి వ్యతిరేకత ఏర్పడలేదు. సాధారణ గృహిణిగా చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబాన్ని తీర్చిదిద్దుతుందనుకున్న భార్య తన కాళ్ల మీద తాను నిలబడే యత్నం చేసేసరికి- మొదట బాధపడ్డా, తరువాత నెమ్మదిగా సర్దుకున్నాడు. మానసికంగా అస్థిరత చెందినా- ఆమె పట్టుదలను, చొరవను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. సాధారణ డిగ్రీ నుంచి పెళ్ళయిన తరువాత బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ సంపాదించిన ఆమె- అతని దృష్టిలో ఉన్నతంగా, అపురూపంగా కన్పించింది.

అప్పటికే ఆమె ఒక బిడ్డకు తల్లి! ఆమెను ఉద్యోగంలో చేరవద్దని గట్టిగా చెప్పలేకపోయాడు శ్రీహర్ష. ఎవ్వరినీ నొప్పించలేడు పాపం! "పసిపిల్లను ఒంటరిగా వదిలి నువ్వూ, నేనూ ఇద్దరం ఉద్యోగాలకని వెళ్లిపోతే ఎట్లా?" అన్నాడు.

ఎవరికీ ఇబ్బంది లేని ఉపాయం ఆలోచించింది. పాపల్ని దగ్గరలో ఉన్న 'క్రష్'లో చేర్చింది. మొగుడికి ఇష్టం ఉన్నా, లేకపోయినా... అతని మాట ప్రక్కనపెట్టి శ్రీహర్ష పనిచేస్తున్న మల్టీనేషనల్ ప్రారంభించింది. మొత్తానికి ఒకటి రెండు సంవత్సరాలలోనే తన ప్రతిభను నిరూపించుకుంది.

ఉన్నదాంట్లో తృప్తిపడి శాంతిగా, సుఖంగా బ్రతకాలని అతని ఆశయం! ఆమెకి ఇంకా ఇంకా ఏదో సాధించాలన్న ఆరాటం! ఇంటి విషయాలన్నీ ఆమె దృష్టిలో 'సెకండరీ.'

"పిల్లలను అశ్రద్ధ చేస్తున్నావు. వాళ్ళ ఫ్యూచర్ గురించి ఆలోచించడం లేదు. మన జీవితాలై పోయాయి. మనకోసం తాపత్రయ పడటం మాని, వాళ్ళ గురించి ఆలోచించాలి. వాళ్ళు చదువు మీద శ్రద్ధ చూపకపోతే- ఈ కాంపిటేటివ్ వరల్డ్‌లో వాళ్ళు వెనకపడిపోతారు!" అనేవాడు.

"అందుకే నా ప్రయత్నం! పిల్లల చదువు, వాళ్ళ బాధ్యత మనమీద ఉంది. ఎన్ని లక్షల ఖర్చు మన ముందు ఉందో ఆలోచించరేం? వాళ్ళ చదువులను చూసుకోవడానికి రెసిడెన్సీ స్కూల్స్, కాలేజీ లైఫ్ ఎన్నో ఉన్నాయి. దేనికైనా డబ్బు అవసరం! మనకి తాతముత్తాత లిచ్చిన కోటలు ఏమున్నాయి? మీలా వచ్చేవాటితోనే సంతృప్తి పడి కూర్చుంటే ఈ బరువులన్నీ ఎవరు ఎత్తుతారు?" అని ఆమె వాదన.

ప్రొఫెషనల్‌గా పైకి ఎదగాలనే తపనతో నిర్విరామంగా కృషి చేసిన కావేరికి ప్రమోషన్స్ త్వరత్వరగా రావడంతో- భర్త కన్నా బాధ్యతలతో కూడిన ఉన్నతస్థాయిని సంపాదించింది. దానితో పనిచేస్తున్న కంపెనీలోని మరో యూనిట్‌కి ట్రాన్స్‌ఫర్ కావడం కూడా కొద్దికాలంలోనే జరిగిపోయింది. భార్య ఎదుగుదల తనకు కొత్తకొత్త చికాకుల్ని తెచ్చిపెడుతున్నా ఏమీ అనలేని శ్రీహర్ష అతిమంచితనం ఆమెకు తిరుగంటూ లేకుండా చేసింది.

కావేరికి ఇప్పుడు తను, తన ఉద్యోగం... అవే ఆమె సర్వస్వాలు!

'బాగా డబ్బు, పేరు ప్రతిష్టలు సంపాదించాలనీ, దాన్ని సాధించిననాడు- మొగుడూ, పిల్లలే కాదు- ఈ ప్రపంచమే తన ముందు ప్రణమిల్లుతుంది!' అని ఆమె విశ్వాసం. తన ఎదుగుదల కోసం కట్టుకున్న భర్తనీ, కన్నపిల్లల్ని కూడా పెద్దగా లెఖ్కచేయకుండా ఏమాత్రం బాధ అనేది లేకుండా కొత్త ఊరిలో, కొత్త ఎసైన్‌మెంట్ వైపు దృష్టి సారించింది.

సాత్వికుడైన శ్రీహర్ష డబ్బు మనిషి కాదు. జీవితంలో 'డబ్బు సంపాదన' ఒక్కటే ఏకైక లక్ష్యం కారాదు. 'మనిషిగా బ్రతకాలి, పదిమందికి మానవత్వాన్ని పంచిపెట్టాలి' అనుకొనేవాడు. దానితో భార్యను ప్రేమించగలిగాడు కానీ, భార్య ఎదుగుదలను ప్రేమించలేకపోయాడు. ఒకటి రెండుసార్లు ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తే ఆమె తిరస్కరించింది. దానితో ఇద్దరి మధ్య తెలియని అగాధం ఏర్పడింది.

సంపాదించిన హోదా, పరపతి కావేరిలో అహం, దర్పం, గర్వాల్ని ఆపాదించి పెట్టాయి. కుటుంబం పైనా, పిల్లలపైనా ఏర్పడవలసిన ప్రేమాభిమానాలు ఆమెలో కనుమరుగవుతుంటే- అతనిలో గట్టిపడసాగాయి. ఉన్నంతలో సంతృప్తి పొందడం, ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించి మనసు ప్రశాంతంగా ఉంచుకోవడంతో- ఎంతో మనశ్శాంతిని, అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందేవాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత కావేరి పనిచేస్తున్న బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫరయింది శ్రీహర్షకి. భార్య క్రింద పనిచేసే భర్తగా అక్కడికి షిఫ్ట్ అయ్యాడు.

ఇరవైనాలుగు గంటలూ కావేరి ఆలోచనలన్నీ తన ఉద్యోగం గురించే! పైఅధికారుల్ని ప్రసన్నం చేసుకొనేందుకు తాపత్రయపడేది. ఆఫీసులో తన గురించి ఏ గాసిప్స్ వినబడుతున్నా పట్టించుకొనేది కాదు. చివరికి బదిలీ మీద వచ్చిన భర్త కూడా ఆమె దృష్టిలో చిన్నగా కన్పించసాగాడు. చివరికి తనవారిని పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. శ్రీహర్ష నిర్వహించే సత్సంగాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆమెకు చాలా అల్పమైన విషయాలుగా తోచేవి. అవి అసమర్థులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు అనుకొనేది. ఒక్కమాటలో చెప్పాలంటే... అతన్ని తన భర్తగా నలుగురిలో చెప్పుకునేందుకు ఇబ్బంది పడేది.

అవిశ్రాంతమైన ఆమె జీవనపోరాటంలో 'ఏదో సాధిద్దాం' అనుకొని, ఎంతో జీవన మాధుర్యాన్ని కోల్పోతున్నా- కావేరికి తెలియరావడం లేదు. మొత్తానికి- ఏ అధికారికీ, ఆమెకీ మధ్య ఎఫైర్ ఉందని అందరూ చెవులు కొరుక్కున్నారో... ఆ అధికారి ట్రాన్స్‌ఫర్ కాబడి, ఆయన స్థానంలో ఆమె నియమింపబడింది. కావేరి కొన్నికోట్ల బిజినెస్‌కి ఒక ఏరియా మేనేజర్. బిజినెస్ నెట్‌వర్క్ ఇంప్రూవ్‌మెంట్ కోసం ఆమెకు అమెరికాకు వెళ్లే ఛాన్స్ కల్పించింది టాప్‌మేనేజ్‌మెంట్. అఫీషియల్ ఆర్డర్ కోసం ఎదురుచూస్తూ... మూడునెలలు ఈ ట్రైనింగ్ పూర్తిచేసుకొని వస్తే

తనకిక తిరుగుండదని ఆశపడింది. అందరూ ఆమె ఎంతో అదృష్టవంతురాలని మెచ్చుకుంటున్నారు. మనసులో ఈర్ష్యపడుతున్నా- పైకి ఆమె ప్రతిభకు తగిన అవకాశం వచ్చిందని పొగడ్తలతో ముంచెత్తుతోంటే... నిజమేననుకొని మురిసిపోయింది.

కాలగమనంలోని ఒడిదుడుకులు మనుషుల గమ్యాలనే నిర్దేశిస్తాయట! కలిసిరాని కాలంలో కోయిల పాట కాకికూతలా వినిపిస్తుందట! అకస్మాత్తుగా అక్కడ ఏదో తెలియని రాజకీయం జరుగింది. ఆమె బాధ్యత వహించిన ఏరియాలోని వ్యాపార లావాదేవీలలో అవినీతి కోణాలు ఒక్కొక్కటే వెలుగుచూశాయి. తనకు ప్రత్యక్షంగా ప్రమేయం ఏమీ లేకపోయినా- వెలుగుచూస్తున్న చీకటి కోణాలన్నీ ఒక్కొక్కటిగా తన మెడచుట్టూ ఉరితాళ్ళుగా చుట్టుకుంటుంటే అల్లాడిపోయింది. తాను ఎంతగానో ఎదురుచూసిన అమెరికా ట్రైనింగ్‌కి తన స్థానంలో మరొకరిని పంపడంతో- తీవ్ర నిరాశకు లోనైంది. కన్నకలలు కాలి, బూడిద అయినప్పుడు- ఊహలు, ఆశలు ఎండమావుల్లా వెక్కిరించినప్పుడు... సహనాన్ని కోల్పోతాడు మానవుడు!

ఆమె కలలన్నీ కల్లలయి పెద్దషాక్‌కు గురయ్యింది. నిస్పృహ, నిరాశ కారుమేఘాల్లా ముసిరి ఆమెను కృంగదీశాయి. తాను ఏదికావాలని ఆశపడిందో- అది పొందలేని కావేరి... అందరి మధ్య ఏకాకి అయిపోయింది.

ధనం ఎప్పుడూ ఒంటరిగా రాదు. చుట్టాల్ని, స్నేహితుల్ని, కీర్తిప్రతిష్టలని వెంటపెట్టుకుని సకుటుంబ సపరివారంగా అన్నట్లు ఆడంబరంగా వస్తుంది. వెళ్లిపోయేటప్పుడూ అంతే! అందర్నీ వెంటపెట్టుకొని నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుంది.

తీవ్రనిరాశతో కొట్టుమిట్టాడుతున్న కావేరికి ఓ ఆశాకిరణం శ్రీహర్ష! ఆమెకు ధైర్యాన్ని నూరిపోస్తూ, జరిగిన స్కాంలలోని నిజనిజాలను వివరిస్తూ, వాటినుండి తప్పించుకోవడానికి, తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టడానికి- అతను తగిన సూచనలు, సలహాలు ఇస్తూంటే... మునిగిపోతున్న నావకు చుక్కానిలా కన్పించసాగాడు. అతనిలో ఒక ఆత్మబంధువు కనబడుతున్నాడామెకు.

'మనిషి మనసు మహా చిత్రమైనది! ఒంటరిగా ఉన్నా- ఒక్కొక్కసారి హాయిగా, అద్భుతంగా ఉంటుంది. మళ్లీ ఇంకోసారి పదిమందిలో తిరుగుతున్నా- చుట్టూ ఎవరూ లేనట్లు ఏకాకిగా, ఎడారిలో నిలబడి దిక్కులు చూస్తున్నట్లు అన్పించి వెర్రివాళ్ళను చేస్తుంది.'

పిల్లల చదువు గురించి, ఇంటి గురించి, భర్త గురించి తనెంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో అర్థమయింది ఆమెకు. అందని వాటికోసం అర్రులు చాచకుండా ఉన్నంతలో తృప్తిగా, శాంతిగా బ్రతకడానికి ఇష్టపడే భర్త- ఇప్పుడు చాలా అపూరూపమైన మేరుపర్వతంలా కనిపిస్తున్నాడు. తాను ఆయన్ని పూర్తిగా విస్మరించినా- చలించక, తననే ఆరాధించిన శ్రీహర్షలో శ్వేతసౌధంలాంటి నిజాయితీ, వ్యక్తిత్వాలు గుబాళిస్తున్నాయి. అతన్ని పూర్తిగా అర్థంచేసుకోగలుగుతోంది.

తాను ఎంతో ముందుకు పరుగెత్తుతున్నాననుకున్నా- ఈ పోటీప్రపంచంలో ఎవరో ఒకరు తనకన్నా ముందు పరిగెడుతూనే ఉంటారు. మనిషిని నిజాయితీగా ఎదగనీయకుండా ఎన్నో తంత్రాలు జరిపే ఈ వ్యవస్థలో- మనిషికి జీవితంలో నిజంగా కావాల్సినవేమిటో కొంచెంకొంచెంగా బోధపడుతున్నాయామెకు.